క్లుప్తంగా

పేరెంట్స్ కమిటీ ఎన్నిక


రవీందర్

కడెం: మండలంలోని నచ్చన్ఎల్లాపూర్ గ్రామంలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో శనివారం పేరెంట్స్ కమిటీ ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నగవత్ రవీందర్, ఉపాధ్యక్షుడిగా దేవోల్ల రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, కోశాధికారిగా చెన్ను మల్లేశ్, సంయుక్త కార్యదర్శిగా రాజ్‌కుమార్, సభ్యులుగా రమ, గంగామణి, శ్రీనివాస్, గంగాధర్, రాకేశ్ తదితరులు ఎన్నికయ్యారు.

సింగాపూర్‌లో వైద్య శిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కడెం: ఖానాపూర్ మండలంలోని సింగాపూర్‌లో కడెం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.శివకుమార్ ఆదేశాల మేరకు శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. సింగాపూర్ గొండుగూడ, తండాకు చెందిన 54 మందిని పరీక్షించారు. షుగర్, రక్తహీనత, అనీమియాతో బాధపడుతున్న వారికి మందులు అందించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వేణుగోపాల్, సిబ్బంది రేణుక, లక్ష్మి, నిహారిక, భూమయ్య, లావణ్య, తిరుపతమ్మ తదితరులున్నారు.

పీఆర్టీయూ మండల కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గం

ఖానాపూర్: పట్టణంలో పీఆర్టీయూ ఖానాపూర్ మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు యూనియన్ ఎన్నికల అధికారులు కె.శంకర్, నరేంద్రబాబు, బీవీ రమణరావు, డి.శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పీఆర్టీ యూ మండలాధ్యక్షుడిగా అంబటి గంగన్న, ప్రధాన కార్యదర్శిగా బెజ్జారపు మురళి, అసోసియేట్ అధ్యక్షుడిగా రాఘవేంద్ర వర్మ, మహిళ ఉపాధ్యక్షురాలిగా సి.సుజాత, కార్యదర్శిగా బి. రాజశేఖర్ ఎన్నికయ్యారు. సంఘ బలోపేతానికి పాటుపడుతూనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు.

పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు


మరమ్మతులు చేయిస్తున్న చైర్మన్ సత్యం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలకు శనివారం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు కలుషితమవుతుందని కాలనీవాసులు విన్నవించడంతో చైర్మన్ స్పందించి మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో నాయిని సంతోష్, జన్నారపు శంకర్, భీమేశ్వర్, జనార్దన్, చందు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు


అవార్డు అందుకుంటున్న సన్నిత్‌కుమార్

ఖానాపూర్: మండలంలోని రాజురా గ్రామానికి చెందిన ఆదిత్య ఐకేర్ నిర్వాహకుడు డాక్టర్ సన్నిత్‌కుమార్‌కు తెలంగాణ నుంచి 'రియాలిటీ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు'లో చోటు దక్కింది. శనివారం బెంగళూర్‌లో జరిగిన సమావేశంలో ఆయన అవార్డు అందుకున్నారు. సేవలను గుర్తిస్తూ 16 దేశాల కమిటీ సభ్యులు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు సన్నిత్‌కుమార్ పేర్కొన్నారు.

ఘనంగా హిందీ దివస్


హిందీ అక్షరాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కుంటాల: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో శనివారం ఘనంగా హిందీ దివస్ నిర్వహించారు. అధికార భాష హిందీ దేవనాగరి లిపి నుంచి రూపొందించారని.. ప్రపంచంలో ఎక్కువగా మాట్లాడే భాషల్లో హిందీ రెండోస్థానంలో ఉందని ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్ తెలిపారు. విద్యార్థులు హిందీ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రదర్శననిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విఘ్నాలు తొలగించు వినాయకా..


నర్సాపూర్(జి)లో లంబోదరుడి విగ్రహం

- కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని బోయవాడలో ఆజాద్ యూత్ సభ్యులు భారీ లంబోదరుడి ప్రతిమను ప్రతిష్ఠించారు. శనివారం అన్నదానం చేశారు. మండలంలోనే పెద్ద విగ్రహం ఇదేనని నిర్వాహకులు పేర్కొన్నారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక మండపాల వద్ద పూజలు నిర్వహిస్తున్నారు. మణికంఠ యూత్ ఏర్పాటు చేసిన గణేశుడి వద్ద హోమం నిర్వహించారు. సీఐ నైలు పూజలు చేశారు. కుంటాలలో గుద్దేటి గంగయ్య, గందె వెంకటసాయి అన్నదానం ఏర్పాటు చేశారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రధాన రోడ్డు పక్కన ఏడు భారీ వినాయక విగ్రహాలు కొలువుదీరాయి. శనివారం ఆయా మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.


కుంటాలలో పూజలు చేస్తున్న సీఐ నైలు, భక్తులు

కుంకుమపూజలు, అన్నదానం

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామంలో ఫ్రెండ్స్‌యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమ వద్ద శనివారం సామూహిక కుంకుమార్చనలు చేశారు. పట్టణంలోని రాజీవ్‌నగర్ మండపంలో కుంకుమార్చనలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రి, మండపాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

పూజలందుకుంటున్న కర్ర మోక్ష గణనాథుడు


లోకేశ్వరం: అబ్దుల్లాపూర్‌లో భజన చేస్తున్న ఎల్వి గ్రామ భక్తులు


ఖానాపూర్ : తర్లపాడ్‌లో కుంకుమార్చనలో భక్తులు


లక్ష్మణచాంద: తహసీల్దార్ కార్యాలయ సమీపంలో గణనాథుడు

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కర్ర మోక్ష గణపతిని దర్శించుకునేందు భక్తులు తరలివచ్చారు. తానూరు మండలంలోని ఎల్వి గ్రామ మహిళలు చేసిన భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఆదర్శనగర్ గణపతి..



నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ కాలనీలో ఫ్రెండ్స్ యూత్ ఏర్పాటు చేసిన గణేశుడి ప్రతిమ బంజారా సంప్రదాయ రీతిలో ఆకట్టుకుంటుంది. గణపతి ప్రతిమ పక్కన పార్వతిదేవి ఎడమవైపు కుమారస్వామి విగ్రహాలతోపాటు ఊయల ఊపుతున్న దశ్యాలు కనువిందు చేస్తున్నాయి.

కర్ర వినాయకుడికి భక్తుల తాకిడి

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో కొలువుదీరిన కర్ర వినాయకుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. శనివారం సెలవుదినం కావడంతో భక్తులు ఆలయానికి బారులు తీరారు. వివిధ రకాల నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. హారతి కార్యక్రమానికి తరలివచ్చారు. భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు నాగనాథ్, అధ్యక్షుడు మురళి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి


హారతి కార్యక్రమానికి హాజరైన భక్తులు

కోర్కెలు తీర్చే కొరడి గణపతి

- మాటేగాంలో స్వయంభుగా వెలిసిన దేవుడు
- మొక్కులు చెల్లించుకునేందుకు తరలివస్తున్న భక్తులు


మాటేగాంలో వెలిసిన కొరడి గణేశుడు

భైంసారూరల్: భైంసా నుంచి నిర్మల్ వెళ్లే జాతీయ రహదారిని ఆనుకుని భైంసా పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మాటేగాం గ్రామంలో కొరడి గణేశ్ స్వయంభుగా వెలిశాడు. ఎనిమిదేళ్ల కిందట గ్రామంలో క్రికెట్ ఆడుతున్న పిల్లలకు గణేశుడు కొరడి రూపంలో దర్శనమివ్వగా.. వారు ఆ ప్రతిమను ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఈ గణేశుడికి ముడుపులు కట్టడంతో ఏళ్ల తరబడి ఉన్న వ్యాధులు నయమవడంతోపాటు కోరికలు తీరినట్లు కొందరు పేర్కొన్నారు. దీంతో గ్రామస్తులు ఐక్యంగా ముందుకొచ్చి కొరడి గణేశుడికి ఆలయం నిర్మించారు. దీంతో ఏడాది పొడవునా ఈ గణేశుడిని దర్శించుకునేందుకు వివిధ గ్రామాల ప్రజలు తరలివచ్చి పూజలు చేస్తున్నారు.

నవరాత్రులు పూజలు...

వినాయక చవితి పండుగ సందర్భంగా కొరడి గణేశుడిని ప్రత్యేక గది నుంచి తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. నవరాత్రుల అనంతరం ప్రధాన వీధులగుండా ఊరేగించి సమీప చెక్‌డ్యాం వద్దకు తీసుకెళ్లి నీళ్లు చల్లి తిరిగి మళ్లీ ప్రత్యేక గదిలోనే భద్రపరుస్తారు.

పాదయాత్రగా భక్తులు..

ఏటా నవరాత్రుల సమయంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మాటేగాం వచ్చి ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నారు. పాదయాత్రగా వచ్చే భక్తులకు జాతీయ రహదారిపై అల్పాహారం, పాలు, పండ్లు పంపిణీ చేస్తున్నారు. రోజు 3 వేల మంది పాదయాత్రగా వచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు. నవరాత్రులు నిర్వహించే కార్యక్రమాల్లో చిన్న నుంచి పెద్దల వరకు గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. రోజు 20వేలకుపైగానే భక్తులు కొరడి గణేశుడిని దర్శించుకుంటున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రోజూ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు ఇబ్బంది కల్గకుండా పార్కింగ్ సౌకర్యంతోపాటు అన్ని ఏర్పాట్లు చేశారు. భైంసారూరల్ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేసి భక్తులకు సేవలు అందిస్తున్నారు.


గణేశుడి దర్శనం కోసం క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు

'ఆదర్శ'లో బదిలీలు

కుంటాల: ఆదర్శ పాఠశాల(మోడల్ స్కూలు)ల్లో పని చేసే ఉపాధ్యాయుల బదిలీలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో 11 ఏళ్ల తర్వాత బదిలీలు చేపట్టారు. శనివారం కుంటాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ ఆర్డర్ కాపీ అందజేశారు. అలాగే కుంటాల ఆదర్శ పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులు విధుల్లో చేరారు.

స్వర్ణ ప్రాజెక్టు కాలువల్లో నిమజ్జనం వద్దు

సారంగపూర్: మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు ప్రధాన కాలువల్లో గణేశుడి ప్రతిమలను నిమజ్జనం చేయవద్దని అలా చేస్తే చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ విభాగం నంబర్ -3 ఈఈ లక్ష్మీ ఓ ప్రకటనలో తెలిపారు. కాలువల్లో నిమజ్జనం చేస్తే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ కరిగి ప్రతిమల తయారీలో ఉపయోగించే కొబ్బరిపొట్టు తూముల్లో ఇరుక్కుపోయి సాగునీటికి ఆటంకం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అలాగే కాలువల్లో పూడిక సైతం పేరుకుపోయి ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. ఈవిషయం గుర్తించి మండపాల నిర్వాహకులు కాలువల్లో ప్రతిమలను నిమజ్జనం చేయవద్దని కోరారు.

వినాయకుడికి మహా నైవేద్యం


కొండుకూర్‌లో నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

కడెం: మండల కేంద్రంలోని రామాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి 108రకాల నైవేద్యాలు, మండలంలోని కొండుకూర్ గ్రామంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి 21 రకాల నైవేద్యాలను సమర్పించారు. వేడుకల్లో భాగంగా మహిళలు స్వస్తిక్, ఓం ఆకారంలో దీపాలను అలంకరించారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

నర్సాపూర్ (జి): గణేశుడి నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై హన్మాండ్లు అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గణేశుడి మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మిట్టపల్లి రాజేందర్, బర్కుంట నరేందర్, దత్తురాం, దూసముడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పెంబి: వినాయక నిమజ్జన శోభాయాత్రలో గొడవలు, అల్లర్లు జరగకుండా చూసుకోవాలని పెంబి ఎస్సై శంకర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని డ్రాగన్ యూత్ గణేశుడి మండపం వద్ద అన్నదానం ఏర్పాటు చేయగా ఎస్సై పాల్గొని మాట్లాడారు. డీజేలకు అనుమతులు లేదని.. శోభాయాత్ర సమయంలో విద్యుత్ తీగలు, వీధుల గుండా వచ్చే వాహనాలను గమనించాలన్నారు. నిమజ్జన సమయంలో చెరువుల వద్దకు చిన్న పిల్లలను రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసులు రఫీ, నర్సింహ, భీమరాజు, నవీన్ ఉన్నారు.

లక్ష్మణచాంద: గణేశుడినిమజ్జనం వేళ డీజేలకు అనుమతి లేదని.. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సుమలత శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెండు బాక్సులు పెట్టుకొని పూజల అనంతరం నిమజ్జనం నిర్వహించాలన్నారు. పెద్ద పెద్ద డీజేలు ఏర్పాటు చేసి గ్రామాల్లో న్యూసెన్స్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


నర్సాపూర్(జి): మాట్లాడుతున్న ఎస్సై హన్మాండ్లు

భైంసాటౌన్: డీజేలు లేకుండా మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వినాయక నిమజ్జనోత్సవం ప్రశాంతంగా, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆరోగ్య భారతి నాయకులు డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్ కోరారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. డీజేలతో గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యానికి నష్టం కలుగుతుందని పేర్కొన్నారు.

సారంగపూర్: గణపతి నిమజ్జన ఉత్సవాల్లో పెద్ద పెద్ద డీజేలకు అనుమతి లేదని ఎస్సై శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపా రు. మండపాల నిర్వాహకులు మహారాష్ట్ర నుంచి పెద్ద పెద్ద డీజేలను తీసుకొచ్చి వినియోగించే ప్రయత్నాలు చేస్తున్నారనే సమాచారం ఉందన్నారు. రెండు చిన్న సౌండ్ బాక్సులను మాత్ర మే ఉపయోగించాలని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తే పెద్ద డీజేలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పెద్ద శబ్దాలు చేసే డీజేల కారణంగా వృద్ధులు, గుండె సమస్యలున్నవారు చిన్నారులు అనేక ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటుందన్నారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని మండపాల నిర్వాహకులకు సూచించారు.

మత్తు పదార్థాలకు దూరం ఉండాలి


అవగాహన కల్పిస్తున్న కౌన్సిల్ సభ్యులు

భైంసాటౌన్: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంఉండాలని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా డైరెక్టర్ ఠాగూర్ దత్తు సింగ్, నియోజకవర్గ డైరెక్టర్ డాక్టర్ సాప పండరి అన్నారు. శనివారం పట్టణంలోని రెయిన్‌బో డిగ్రీ కళాశాలలో గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మత్తు పదార్థాలకు బానిసగా మారి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఇమ్రాన్, అధ్యాపకులు మహమ్మద్ కలీం, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


పోతన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న నేతలు

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామంలో అప్ప పోతన్న, తోట సంజీవ్, హవర్గలో రామకృష్ణ అనారోగ్యంతో మరణించారు. బాధిత కుటుంబసభ్యులను శనివారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరామర్శించి ఓదార్చారు. వారి వెంట సాయారెడ్డి, ముత్తగౌడ్, శేఖర్‌రెడ్డి, భూమేశ్, భోజారెడ్డి పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

పొంచి ఉన్న ప్రమాదం

లోకేశ్వరం: మండలంలోని హద్గాం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఇటీవల మరుగుదొడ్డి నిర్మించారు. కాంట్రాక్టర్ మరుగుదొడ్డి గుంతలపై పైకప్పు ఏర్పాటు చేయడం మరిచిపోయారు. అటువైపు వెళ్లే విద్యార్థులు అందులో పడే ప్రమాదం ఉంది. వెంటనే కాంట్రాక్టర్ మరుగుదొడ్డికి పైకప్పు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: కాంత్రికుమార్, పీఆర్ జేఈ, లోకేశ్వరం, ఫోన్: 95506 07360



'సబ్‌కమిటీ ఏర్పాటును ఖండిస్తున్నాం'

భైంసాటౌన్: ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన సబ్ కమిటీ ఏర్పాటు చేయడాన్ని ఖండిస్తున్నట్లు భైంసా డివిజన్ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సలహాదారు ప్రభాకర్ గడపాలే అన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మంత్రులు రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, ప్రభాకర్, మల్లు రవి, సీతక్కతో ఏర్పాటు చేసిన కమిటీపై తమకు నమ్మకం లేదని.. హైకోర్టు జడ్జి, న్యాయ ప్రముఖుల నేతృత్వంలో కమిటీ వేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు పనులు ప్రారంభం

భైంసారూరల్: మండలంలోని కుంబి గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.రెండు లక్షలతో నిర్మించే గ్రావెల్ రోడ్డును శనివారం కోఆప్షన్ మాజీ సభ్యులు గజానంద్ ప్రారంభించారు. నిధులు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సూర్యంరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

17న నిర్మల్‌లో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నిర్మల్ రూరల్: తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్, స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 17న జిల్లా కేంద్రంలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మనాభగౌడ్, సామ్యూల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగే ఈ పోటీల్లో స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ అండర్ -14, 17, అథ్లెటిక్స్ అసోసియేషన్ అండర్- 14, 16, 18, 20 బాలబాలికల ఎంపిక పోటీలు ఉంటాయని వివరించారు. రన్నింగ్, జంపింగ్, త్రోస్ విభాగంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. విజేతలు ఈనెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే పదో సౌత్ జోన్ పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 94405 16634, 99511 98890 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

17వరకు సాయుధ పోరాట వారోత్సవాలు


మాట్లాడుతున్న రమేశ్

కడెం: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ఈనెల 17 వరకు ఉత్సవాలను కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భూక్య రమేశ్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని చిన్నక్యాంప్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం 1946 నుంచి 1951 వరకు సాయుధ పోరాటం సాగినట్లు పేర్కొన్నారు. ఇందులో భూదయ్య, రామన్న, లింగన్న, రమణ, తదితరులున్నారు.